క్లుప్తంగా

ముగిసిన రామకోటి మహోత్సవాలు



నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న రామకోటి మహోత్సవాలు గురువారం తో ముగిశాయి. చివరిరోజున స్వామివారికి విశేషపూజలతో పాటు రమా సహిత సత్యనారాయణస్వామి వారి వ్రతం నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ ప్రతిష్ఠ

కీసర(కంచికచర్ల) : మండలంలోని కీసర మున్నేటి సమీపంలో ముత్యాలమ్మతల్లి నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. యాగశాలలో గురువారం వేదస్వస్తి, గోపూజ, మంటపార్చనలు, మూలతంత్ర జపములు, మూలతంత్ర హోమాలు, నారాయణ పాశుపత మంత్ర హోమం, విగ్రహములకు మహాస్నపన, పుష్పశయ్యాధివాసం, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం

జగ్గయ్యపేట:'మేము సిద్ధం–మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని తక్కెళ్లపాడు, షేర్‌మహ్మద్‌పేట, మల్కాపురం, గండ్రాయి గ్రామాల్లో గురువారం బూత్‌కమిటీ సమావేశం నిర్వహించారు. మండల పార్టీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. బూత్‌కమిటీ సభ్యులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సచివాలయ కన్వీనర్ సయ్యద్ షాఉద్దీన్, నాయకులు బజారు సాయి, పోతుమర్తి స్వామి, ఆయా గ్రామాల కన్వీనర్‌లు, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజ



లింగగూడెం(పెనుగంచిప్రోలు): గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీజగదాంబ(మేరీమా అమ్మవారు)ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గురువారం మహిళలచే సామూహిక అష్టలక్ష్మీ కుంకుమ పూజ నిర్వహించారు. అలాగే విగ్రహాలకు, యంత్రాలకు ధాన్యాధివాసం, ధనాధివాసం, పుష్పాధివాసం హోమాలను గాయత్రీ ఆశ్రమ నిర్వాహకులు రామడుగు విక్రమాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం జరిగే ప్రతిష్ఠా మహోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

క్యాంటీన్‌లో అగ్నిప్రమాదం



నందిగామ: పట్టణంలో ఓ క్యాంటీన్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని సీఎం రోడ్డు సమీపంలో నూతనంగా ఓ ఫుడ్ క్యాంటీన్ ఏర్పాటు చేశారు. క్యాంటీన్‌లో వెల్డింగ్ వర్క్ జరుగుతున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి క్యాంటీన్ ముందు భాగంలో ఏర్పాటు చేసిన రెల్లుగడ్డి పందిరి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతం జనావాసాల మధ్య కావడంతో స్థానికులు కొద్దిసేపు ఆందోళనకు చెందారు. ఫైర్‌సిబ్బంది మంటలను వెంటనే అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

స్వామివారికి ఊరేగింపు



నందిగామ: మండలంలోని మాగల్లులో వైకుంఠనారాయణ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో లక్ష్మీజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలోని లక్ష్మీనరసింహస్వామి వారికి విశేష పూజలు చేశారు. స్వామివారిని సర్వభూపాల వాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదానంతో జీవదానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి పి. లక్ష్మణస్వామి ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ బి. శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. మణికంఠ పాల్గొన్నారు.



పెండ్యాలలోని గ్రామసచివాలయం



రూ.33లక్షలతో అభివృద్ధి చేసిన పెండ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల



ముస్లిం కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

ప్రగతిపథంలో పెండ్యాల

- గ్రామంలో రూ.4.50కోట్లతో అభివృద్ధి పనులు
- మునుపెన్నడూలేని అభివృద్ధి
- మారిన పాఠశాలల రూపురేఖలు
- అంతర్గత రోడ్లన్నీ సీసీరోడ్లుగా మార్పు
- ఐదేళ్లలో గ్రామస్తులకు రూ.66.25కోట్ల మేర లబ్ధి..



పెండ్యాల(కంచికచర్ల): మండలంలోని పెండ్యాల గ్రామం ప్రగతిపథంలో దూసుకుపోతోంది. ఐదేళ్ల కిందటి వరకు గ్రామంలో అరకొర వసతులు ఉండగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామస్వరూపమే మారిపోయింది. కోట్లాది రూపాయలతో గ్రామంలో మౌలిక వసతులు కల్పించారు. విద్య, వైద్య, రోడ్డు వసతి, మంచినీరు వంటి కనీసవసతులపై నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రత్యేకంగా దృష్టిసారించి గ్రామంలో ఆయా వసతులను కల్పించారు.

రూ.1.31కోట్లతో పాఠశాలల అభివృద్ధి..

నాడు–నేడు పథకం కింద రూ.51లక్షలతో పెండ్యాలలోని ఎంపీయూపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. విద్యార్థులకు అదనపు తరగతి గదుల నిర్మాణం, మంచినీటి వసతి, బెంచీలు, మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు మౌలికవసతులన్నీ కల్పించారు. రూ.14లక్షలతో ఉర్దూ స్కూల్‌తో అభివృద్ధి చేశారు. రూ.16లక్షలతో ముస్లింకాలనీలోని ఎంపీపీ తెలుగు మీడియం స్కూల్‌ను అభివృద్ధి చేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. 38మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన రూ.5.16లక్షల విలువగల ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది. రూ.50.40కోట్లతో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించారు.

రూ1.50కోట్లతో రోడ్ల నిర్మాణం..

గ్రామంలోని అంతర్గత గ్రావెల్ రోడ్లను రూ.1.20కోట్లతో సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. రూ.30లక్షలతో డొంకరోడ్లు నిర్మించారు. రూ.6లక్షలతో మురుగునీటి వసతి కోసం డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. దీంతో రోడ్డు వసతి మెరుగుపడటం తోపాటు మురుగునీటి పారుదల సమస్య పరిష్కారమైంది. గ్రామంలో రూ.40లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. వేసవి కాలంలో సైతం రక్షిత మంచినీటి పథకం నుంచి నిత్యం ఇంటింటికి కొళాయిల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తుండటంతో గ్రామస్తుల మంచినీటి ఇక్కట్లు తొలగాయి.

గ్రామ సచివాలయాల ఏర్పాటు..

గ్రామంలో రూ.82లక్షలతో రెండు గ్రామసచివాలయాల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే గ్రామసచివాలయం–1 నిర్మాణం పూర్తిగాక రెండో గ్రామసచివాలయం పనులు సాగుతున్నాయి. రూ.32లక్షలతో గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అభివృద్ధి చేశారు. కుటుంబనియంత్రణ ఆపరేషన్ల కోసం అదనపు గదుల నిర్మాణం, కాంపౌడ్ వాల్ నిర్మాణంతో పాటు ఫర్నీచర్ ఏర్పాటు చేశారు.

నవరత్నాలతో రూ.66.25కోట్ల లబ్ధి...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పెండ్యాల గ్రామస్తులకు కోట్లాది రూపాయల మేర లబ్ధిచేకూరింది. జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ రైతు భరోసా, పెన్షన్ కానుక, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, ఆసరా, చేదోడు, వైఎస్సార్ బీమా తదితర ప్రభుత్వ పథకాల ద్వారా ఒకటో సచివాలయం పరిధిలో ఉన్న 7110 మంది లబ్దిదారులకు డీబీటీ రూపంలో ఇప్పటివరకు రూ.45కోట్ల మేర లబ్ధిచేకూరింది. రెండో సచివాలయపరిధిలోని 4167మందికి డీబీటీ రూపంలో రూ.11.34కోట్ల మేర మేలు కలిగింది. నాన్‌డీబీటీ కింద గ్రామంలో 1885మందికి రూ.9.91కోట్ల మేర లబ్ధి చేకూరడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఎంతో అభివృద్ధి చేశాం..



గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. సమస్యలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండేవి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వహయాంలో పెండ్యాల గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. సీఎం జగన్‌కు గ్రామమంతా రుణపడి ఉంటుంది.

–షేక్ మలక్‌బషీర్ ఎంపీపీ

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలి..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాగ్రామం ప్రగతిపథంలో పయనించింది. గ్రామంలో ఎక్కువగా పేద ముస్లిం కుటుంబాలున్నాయి వారికి అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, డ్వాక్రా రుణమాఫీ మైనార్టీ రుణాలు అందాయి. సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావాలి.

–షేక్ బడేహజరత్, పెండ్యాల–2 ఎంపీటీసీ సభ్యుడు

నవరత్నాలతో అభివృద్ధి..



ప్రభుత్వం నవరత్నాలు పథకం కింద అన్నివర్గాల ప్రజలకు అండగా నిలిచింది. ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేయటంతో గ్రామం అభివృద్ధి చెందింది. రైతులు, ప్రజలందరినీ అన్నివిధాలుగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎప్పటికీ మరచిపోం. ఆయనకు అండగా ఉంటాం.

–షేక్ పీర్‌సామియా, గ్రామస్తుడు

ముస్లింలకు న్యాయం చేశారు..



మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం ముస్లింలకు పెద్దపీట వేసి ఆదుకున్నారు. నాలుగుశాతం రిజర్వేషన్లు కల్పించడంతో మా ముస్లింల పిల్లలకు ఉన్నత విద్య అందింది. రాష్ట్రంలో ఎంతోమంది ఇంజినీర్లు అయ్యారు. సీఎం జగనన్న అధికారంలోకి వచ్చాక మాకు మరింత న్యాయం చేశారు.

–షేక్ గౌస్, గ్రామస్తుడు

సీఎం జగన్‌ను కలిసిన ఇంటూరి చిన్నా



జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జగ్గయ్యపేట మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా) మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుతో కలిసి గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఇంటూరి చిన్నా కలిశారు. ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. రానున్న ఎన్నికల్లో సామినేని ఉదయభాను గెలుపునకు కృషిచేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు సూచించినట్లు చిన్నా తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, పెనుగంచిప్రోలు సర్పంచి వేల్పుల పద్మకుమారి, మాజీఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ పోషణ



పెనుగంచిప్రోలు: పోషకాహారంతో సంపూర్ణ పోషణ కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భిణులు రక్తహీనత రాకుండా మంచి పోషక విలువలుగల ఆహారం తీసుకోవడం ద్వారా పుట్టే బిడ్డలు కూడా మంచి ఆరోగ్యంతో జన్మిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, విమల, రాజేశ్వరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

ఆర్వో జి.వెంకటేశ్వర్లు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌వో జి.వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట అర్బన్ : ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయపార్టీలు తప్పక పాటించాలని జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్వో) జి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, పార్టీలు పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. నూతనంగా ఓటు నమోదు చేసుకునేందుకు ఏప్రిల్ 15వతేదీ వరకు గడువు ఉందన్నారు. 85ఏళ్లు పైబడిన, నడవలేని దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువేసే అవకాశం కల్పించామన్నారు. అనుమతి తీసుకున్న వాహనాలను సదరు అభ్యర్థే వినియోగించాలన్నారు. ఒకరి పేరుతో వాహనానికి అనుమతి తీసుకుని మరొకరు వినియోగిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓవ్యక్తి రెండుచోట్ల ఓటువేసినట్లు రుజువైతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. కూటమిగా ఏర్పడిన పార్టీల నుంచి ఏ పార్టీ తరఫు అభ్యర్థి నియోజకవర్గంలో బరిలో ఉంటారో వారికి మాత్రమే కార్యాలయ ఏర్పాటుకు అనుమతిస్తామని చెప్పారు. విడివిడిగా కార్యాలయాలు ఏర్పాటు చేస్తే ఖర్చంతా పోటీలో ఉన్న సదరు కూటమి అభ్యర్థి ఖాతాలో రాస్తామని వివరించారు. ఎన్నికలకు సంబంధించి ఆయా పార్టీల ప్రతినిధుల సందేహాలను ఆర్వో నివృత్తి చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ తరఫున కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఆకుల శ్రీకాంత్, బద్దూనాయక్, టీడీపీ తరఫున ఎస్. రామ్మూర్తి, మైనేని రాధా, ముల్లింగి రామకృష్ణారెడ్డి, బీజేపీ నుంచి మన్నె శ్రీనివాస్, కాంగ్రెస్ తరఫున దాచేపల్లి వీరభద్రరావు, బీఎస్పీ నుంచి కొదమల ప్రభుదాసు, పుష్పరాజు, సీపీఎం నుంచి నాగమణి, లింగారావు, కోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో టీమ్‌తో సమీక్ష...

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సింగిల్ విండో టీమ్‌తో ఆర్‌వో వెంకటేశ్వర్లు సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అనుమతుల కోసం పోలీస్, పంచాయతీ, మున్సిపల్, ఆర్టీవో(రవాణా), విద్యుత్, ఫైర్, ఆర్అండ్‌బీ తదితర ఏడువిభాగాలకు సంబంధించి 19 రకాల అనుమతులకుగాను నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేసినట్లు ఆర్వో తెలిపారు. సమావేశంలో ఏఆర్‌వో, తహసీల్దార్ శేషగిరి, పెనుగంచిప్రోలు, వత్సవాయి తహసీల్దార్లు వి.అమ్మాజీ, కె.సూర్యారావు, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు,పేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి ఎంపీడీవోలు రమేష్‌బాబు, హర్ష, చైతన్య, పేట సీఐ జానకీరామ్, ఎంవీఐ ఎం.రవికుమార్, ఎలక్షన్ డీటీ కిషోర్ పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశామని తహసీల్దార్ రాజకిషోర్ తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలో ఉన్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తరువాతనే రాష్ట్రంలోని అనుమతిస్తున్నట్లు తెలిపారు.

చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతోపాటు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, వీఆర్వో అనూష, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రూ.15 లక్షల ఫర్నీచర్ బహూకరణ



స్కానర్‌ను అందజేస్తున్న స్వర్ణ టోల్‌వేస్ ప్రతినిధులు

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు కీసర స్వర్ణ టోల్‌వేస్ అధికారులు గురువారం నాలుగు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, 100 బెంచీలు, ఎనిమిది రాక్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌బాబు మాట్లాడుతూ కీసరలో స్వర్ణ టోల్‌ప్లాజా ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇటీవల నేషనల్ హైవే పక్కన, పలు ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తోందని వివరించారు. టోల్‌ప్లాజా ద్వారా విద్యార్థుల కోసం రూ.15లక్షల విలువగల బెంచీలు, కంప్యూటర్లు, స్కానర్, ప్రింటర్లు అందజేసినట్లు తెలిపారు. దాతలు అందజేసే పరికరాలను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కంపెనీ సెక్రటరీ రమణసాయి, డీసీఎం సీఓఎం రాజారావు, మేనేజర్ జయప్రకాష్, సేఫ్టీ అధికారి శ్రీనివాస్, సెక్యూరిటీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, హెచ్ఎం శర్మ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

కమిషనర్ హేమమాలిని



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ హేమమాలిని


నందిగామ: వేసవికాలంలో సైతం నందిగామలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. పట్టణానికి నీటిని సరఫరా చేసే కీసర మంచినీటి పథకం పైప్‌లైన్ మరమ్మతు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో నిత్యం కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. వేసవిలో కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



వీరులపాడు: సకల మానవాళికి సత్యం, జీవం, మార్గం ప్రభువు ఏసుక్రీస్తు అని రెవ. ఫాదర్ సాలే వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బోడవాడ, జమ్మవరం గ్రామాల పరిధిలో ఉన్న పరిశుద్ధ లూర్దుమాత ఆలయ 75వ వార్షిక మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం దివ్యబలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఫాదర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జీసెస్ చూపిన సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మనుషుల పాపవిమోచనకే ప్రభువు ఏసుక్రీస్తు ఈలోకానికి వచ్చారన్నారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని వివరించారు. కార్యక్రమంలో ఫాదర్లు నీలూరి మరియదాసు, బలమాల తంబి, జోజిబాబు, సుగుణరావు, దత్తు, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు యాదాల దాసు, కొనకల సాయికుమార్, కర్ల రాజు, పెద్దసంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

న్యాయవాద సంఘ ఉపాధ్యక్షుడిగా 'యలమంచి'



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్‌గా యలమంచి నాగరాజేంద్రప్రసాద్, జాయింట్ సెక్రటరీగా బూడిద నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ ఎన్నికల్లో భాగంగా ఈ పదవులకు సంబంధించి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వీరిద్దరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి న్యాయవాది రాయపూడి శ్రీనివాసరావు తెలిపారు. యలమంచి రాజేంద్రప్రసాద్, బూడిద నరసింహారావులను పలువురు న్యాయవాదులు అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బద్దుల వెంకట్రామయ్య, పసుపులేటి సత్యశ్రీనివాస్, టీఎల్.నరసింహారావు, అన్నెపాగ సుందరరావు, కృష్ణయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ హనీష్

నందిగామ: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. పట్టణంలోని గాంధీసెంటర్‌లో గురువారం సాయంత్రం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపేవారికి, వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చే వాహన యజమానులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా వాహనం నడిపేటప్పుడు లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వాహన చోదకులపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐ విజయ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సతీష్ వర్మ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కామర్స్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని విజయవాడ సెంట్రల్ సర్కిల్ ఇన్‌కమ్ ట్యాక్స్ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ టి. సతీష్ వర్మ చెప్పారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో ఇన్‌కెండో–2కె24 పేరుతో కామర్స్ చదువుతున్న విద్యార్థులకు కామర్స్ కోర్సునకు సంబంధించిన అంశాలతో పాటుగా సాంస్కృతిక అంశాల్లో పోటీలను గురువారం జరిగాయి. సతీష్ వర్మ అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గొప్ప విజయాలు సాధించిన వారి జీవిత పుస్తకాలను చదివి స్ఫూర్తిని పొందాలని చెప్పారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల వారిలో సృజనాత్మకతతో పాటుగా నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. కామర్స్ విభాగాధిపతి కె.నారాయణరావు, సిద్ధార్థ అకాడమీ సభ్యుడు లలిత్ ప్రసాద్ ప్రసంగించారు.

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు..

సభ అనంతరం జరిగిన పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, మైండ్ ఇట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, ఐపీఎల్, మిస్టర్ అండ్ మిసెస్, డ్యాన్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

శరవేగంగా పూడికతీత పనులు



ముక్త్యాల(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట పట్టణానికి నీటిని సరఫరా చేసే ముక్త్యాల గ్రామ సమీపంలో కృష్ణానది వద్దనున్న పంప్ హౌస్ పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జగ్గయ్యపేట మున్సిపాలిటీకి కృష్ణానది నుంచే మంచినీరు సరఫరా అవుతోంది. నదిలో నీటిమట్టం తగ్గడంతో నదిలో ఏర్పాటు చేసిన పంపింగ్ వెల్‌చుట్టూ పూడిక పేరుకుపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. పంప్ హౌస్ వద్ద పూడికతీత పనులు చేపట్టారు. ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పూడికతీత పనులు మరో రెండురోజుల్లో పూర్తవుతాయని, రానున్న వేసవిలో పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.